క్లుప్తంగా

ప్రతిష్టా మహోత్సవ పూజలు ప్రారంభం



శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం

జూలూరుపాడు: అనంతారం గ్రామంలో నూతనంగా శ్రీ అభయహస్త వీరాంజనేయ స్వామి ఆలయం నిర్మించారు. కమిటీ ఆధ్వర్యంలో ఆలయంలో దేవతా విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్టా మహోత్సవ పూజలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 4వ తేదీ విగ్రహం, ధ్వజస్తంభాన్ని ప్రతిష్టించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

మేకలు చోరీపై కేసు నమోదు

ఇల్లెందురూరల్: మండలంలోని మస్సివాగు గ్రామంలో గుగులోత్ బాలాజీకి చెందిన మేకలు శనివారం రాత్రి చోరీకి గురయ్యాయి. మండలోని మేకలను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించుకుపోయినట్లు గుర్తించిన బాలాజీ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దాడి చేసిన వ్యక్తిపై ఫిర్యాదు

పాల్వంచ: నవ లిమిటెడ్ కంపెనీలో సెక్యూరిటీ సూపర్‌వైజర్‌లపై దాడి చేసిన వ్యక్తిపై పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదు అయింది. పోలీసుల కథనం మేరకు... నవ లిమిటెడ్ మూడో గేటు వద్ద గొడవ జరుగుతుందనే సమాచారంతో అధికారుల ఆదేశాల మేరకు సెక్యూరిటీ సూపర్‌వైజర్లు పాసికంటి రవి, చింతా సుధాకర్ అక్కడికి వెళ్లారు. కాగా అక్కడికి ఓ వ్యక్తి పెట్రోల్ బాటిల్‌తో వచ్చి లోపలికి అనుమతి ఇవ్వాలని అక్కడ విధుల్లో ఉన్న సెక్యూరిటీ సూపర్‌వైజర్ తూము కృష్ణతో గొడవ పడుతున్నాడు. దీంతో అతనిని ఎంత సముదాయించినా వినకుండా వారిపై ఘర్షణకు దిగి దాడి చేశాడు. దీంతో పాసికంటి రవి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ బి.రాము కేసు నమోద్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సెల్‌ఫోన్ చోరీ

పాల్వంచ: ఇంట్లో సెల్‌ఫోన్ చోరీకి గురికావడంతో బాధితుడు పోలీస్‌లకు ఫిర్యాదు చేశాడు. వివరాలు.. పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన మహ్మద్ రిజ్వాన్ ఇంట్లో రూ.40వేల విలువ చేసే సెల్‌ఫోన్ మార్చి 21న చోరీకి గురైంది. కాగా సెల్‌ఫోన్‌ను అదే ఏరియాకు చెందిన ఓ వ్యక్తి వచ్చి చోరీ చేసినట్లు అనుమానిస్తూ ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్ఐ బి.రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం..

సుజాతనగర్: బొడ్రాయి సెంటర్‌లోని మర్రి చెట్టు ఎండిపోయి ప్రమాదకరంగా మారింది. కొన్ని నెలల క్రితమే ఈ చెట్టు ఎండిపోగా.. ఇటీవల ఓ కొమ్మ విరిగి పడిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. మిగిలిన కొమ్మలు పూర్తిగా ఎండిపోయి ఏ క్షణంలోనైనా పడిపోయేలా ఉన్నాయి. చెట్టు కింద విద్యుత్ లైన్లు కూడా ఉన్నాయి. ప్రమాదం జరగముందే చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

నవభారత్ చౌరస్తాలో జర భద్రం..



ట్రాఫిక్ సిగ్నళ్లు లేని నవభారత్ సెంటర్

నవభారత్: పాల్వంచలోని నవభారత్ సెంటర్ చౌరస్తా నిత్యం వందలాది వాహనాలతో రద్దీగా ఉంటుంది. కలెక్టరేట్ నుంచి నవభారత్ ఒకేషనల్ సెంటర్ వరకు రోడ్డుపై కనీసం ట్రాఫిక్ సిగ్నళ్లు కూడా లేకుండా మూడు మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. నవభారత్ పాఠశాలలకు ఎదురుగా ఉన్న రోడ్డు దాటడానికి విద్యార్థులకు, పాదచారులకు, ద్విచక్ర వాహనాలకు ఇబ్బందిగా ఉంది. కొత్తగూడెం నుంచి భద్రాచలం, మణుగూరు నుంచి ఇల్లెందు, విజయవాడ, ఖమ్మం వెళ్లే వాహనాలతో నిత్యం ఇక్కడ రద్దీగా ఉంటుంది. దీని వలన అటువైపుగా నడిచే పాదచారులకు, మోటార్ సైకిల్ వాహనాలకు ట్రాఫిక్ సిగ్నళ్లు లేకపోవడంతో ప్రమాదాలు జరిగిన సందర్భాలు ఉన్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నవభారత్ చౌరస్తాలో ట్రాఫిక్ సిగ్నళ్లు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

సేవా కార్యక్రమాల్లో మేటి

భద్రాచలంటౌన్: రెండేళ్లుగా ఆర్యవైశ్య మహాసభ ఆధ్వర్యంలో జిల్లాలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు జిల్లా అధ్యక్షుడు చారుగుళ్ల శ్రీనివాస్ తెలిపారు. స్థానిక జీయర్ మఠంలో ఆదివారం ఆయన మాట్లాడారు. దోసపాటి వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, వినోద్‌కుమార్, రామచంద్రరావు పాల్గొన్నారు.

ఘనంగా ఈస్టర్ వేడుకలు



టేకులపల్లి: కొవ్వొత్తులు వెలిగించి సామూహిక ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

ఇల్లెందురూరల్: మండలంలోని పలు గ్రామాల్లోని చర్చిల్లో క్రైస్తవులు ఆదివారం ఈస్టర్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే చర్చిలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పిల్లలు, పెద్దలు కొత్త బట్టలు ధరించి చర్చిలకు చేరుకొని వేడుకల్లో పాల్గొనడంతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది. కమిటీల ఆధ్వర్యంలో చర్చిలను విద్యుద్దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

కొత్తగూడెంరూరల్: యేసుక్రీస్తు పునరుత్థాన వేడుకలు కొత్తగూడెం పట్టణంలోని బేతస్థ ప్రార్థన మందిరంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రీస్తు మరణించి తిరిగి లేచిన రోజును విశ్వాసులు అత్యంత భక్తిశ్రద్ధలతో నూతన వస్త్రాలు ధరించి, ఉదయం 3 గంటలకే చర్చికి వచ్చి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్లు విజయ్ శరత్, సన్ని మాట్లాడుతూ.. యేసుక్రీస్తు మానవుల పాపాలు తన మీద వేసుకొని, శుక్రవారం మరణించారని, మళ్లీ ఆదివారం తిరిగి లేచారన్నారు. ఇదే యేసు పునరుత్థానం అనిపేర్కొన్నారు. సృష్టిలోని ప్రతీఒక్కరిని యేసుక్రీస్తు ప్రేమించిన విధంగా మానవులందరినీ క్రైస్తవులు ప్రేమించాలన్నారు.

సుజాతనగర్: ఏసు పునరుత్థానానికి సూచికగా క్రైస్తవులు ఈస్టర్ పర్వదినాన్ని ఆదివారం సుజాతనగర్‌లో ఘనంగా జరుపుకున్నారు.

ఈ సందర్భంగా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు, పాస్టర్లు ఏసుక్రీస్తు మహిమలను వివరించారు.



జూలూరుపాడు ఆర్‌సీఎం చర్చిలో...

జూలూరుపాడు: మండలంలోని క్రైస్తవులు ఈస్టర్ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఏసుక్రీస్తు శుక్రవారం సిలువ శిక్షలో ప్రాణాలు వదిలి, సమాధి చేయబడి తిరిగి మూడో రోజు ఆదివారం పునరుత్థానం చెందుతాడు. ఈ పుణ్యదినాన్ని ఈస్టర్ పర్వదినంగా క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల కేంద్రంలోని ఆర్‌సీఎం, హోలీఫైత్, బిలీవర్స్, సీఎస్ఐ, పెంతుకోస్తు, శృంగారపు తదితర చర్చిల్లో ఉదయం నుంచి ఆయా చర్చిల ఫాదర్లు, పాస్టర్లు ఆధ్వర్యంలో ఏసు ప్రభువుకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చర్చిలన్నీ భక్తులతో కిటకిటలాడాయి.

టేకులపల్లి: మండలంలోని ఆర్‌సీఎం, సీఎస్ఐ, పెంతెకొస్తు, మారనాత తదితర చర్చిలలో ఏసుక్రీస్తు పునరుత్థానం వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సులానగర్ ఆర్‌సీఎం చర్చిలో ఫాదర్ తుంపాటి అగస్టీన్ ప్రత్యేక ప్రార్థనలు చేస్తూ వ్యాఖ్యాన్ని బోధించారు. హింస, ద్వేషాలు మరణాన్ని ఇస్తాయని, ప్రేమ, క్షమాపణలు, జీవితానికి నూతనత్వాన్ని ఇస్తాయని నిరూపించడానికి ఏసుక్రీస్తు సమాధి నుంచి సజీవుడై తిరిగి వచ్చాడని చెప్పారు. కేక్ కట్ చేసి కొవ్వొత్తుల వెలిగిస్తూ ఒకరికొకరు ఈస్టర్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



సుజాతనగర్ చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



ఇల్లెందురూరల్: మామిడిగూడెం చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు



కొత్తగూడెంరూరల్: బేతస్థ ప్రార్థనా మందిరంలో వేడుకలో పాల్గొన్న భక్తులు



జూలూరుపాడు: బిలీవర్స్ చర్చిలో సామూహిక ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

బాధ్యతతో పనిచేస్తే గుర్తింపు వస్తుంది..

కొత్తగూడెంఅర్బన్: శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. కొత్తగూడెం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఏఎస్ఐ ప్రసాద్ ఉద్యోగ విరమణ సందర్భంగా ఆదివారం కొత్తగూడెం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పట్టణంలోని పీఆర్ ఫంక్షన్ హాల్‌లో సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు హాజరయ్యారు. మాట్లాడుతూ... 35 సంవత్సరాలుగా జిల్లా పోలీస్ శాఖలో నిజాయితీగా బాధ్యతతో విధులు నిర్వర్తిస్తూ ఉద్యోగ విరమణ పొందుతున్న ఏఎస్ఐ ప్రసాద్‌కు అభినందనలు తెలిపారు. శేష జీవితాన్ని వారి కుటుంబ సభ్యులతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖలో పనిచేస్తూ ప్రత్యక్షంగా ప్రజలకు సేవ చేయడం గొప్ప వరమన్నారు. నిబద్ధత, బాధ్యతతో విధులు నిర్వర్తించే వారికి ఎల్లప్పుడూ ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ఏఎస్ఐ ప్రసాద్ క్రమశిక్షణతో పోలీస్ శాఖకు అందించిన సేవలను, ఆయన పనితీరును ప్రతీఒక్కరు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆయనను శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ రెహమాన్, సీఐలు నాగరాజు, వెంకటేశ్వర్లు, కరుణాకర్, శివప్రసాద్, రమేష్, ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు రమణారెడ్డి, ప్రవీణ్, ట్రాఫిక్ ఎస్సైలు నరేష్, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షుడు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



ప్రసాద్‌ను సన్మానిస్తున్న పోలీసు ఉద్యోగులు

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

సుజాతనగర్: సుజాతనగర్ 11 కేవీ ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 7.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని ఏఈ కిషన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

సైదులుకు పరామర్శ



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కనకయ్య

ఇల్లెందురూరల్: అనారోగ్యంతో శస్త్రచికిత్స చేయించుకొని ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్న కాంగ్రెస్ మండల శాఖ అధ్యక్షుడు పులి సైదులును ఎమ్మెల్యే కోరం కనకయ్య ఆదివారం పరామర్శించారు. శస్త్రచికిత్స వివరాలను, ప్రస్తుత ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ శాఖ అధ్యక్షుడు దొడ్డ డానియల్, నాయకులు సాంబమూర్తి, పూనెం సురేందర్, పాయం కృష్ణప్రసాద్ తదతరులు పాల్గొన్నారు.

గ్లోబల్ టెండర్లతో తీవ్ర నష్టం



మాట్లాడుతున్న నర్సింహారావు

టేకులపల్లి: సింగరేణి సంస్థలో గ్లోబల్ టెండర్లతో బొగ్గు రవాణా చేస్తున్న ఓనర్లకు, డ్రైవర్లకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఓనర్ల అసోసియేషన్ అధ్యక్షుడు నేలవెల్లి నర్సింహారావు, డ్రైవర్ల యూనియన్ ప్రతినిధులు రాసుద్దీన్, పాయం వెంకన్న అన్నారు. ఆదివారం ఏర్పాటైన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కేటీసీ నుంచి ఇల్లెందుకు బొగ్గు రవాణాకు ఒకే కాంట్రాక్టర్ టెండర్లు తగ్గించుకుంటూ వేస్తున్నాడన్నారు. తక్షణమే శ్రీదేవి కాంట్రాక్టర్ దక్కించుకున్న టెండర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గత టెండర్ టన్నుకు రూ.161 ఉండగా తాజాగా దానికంటే టన్నుకు రూ.18 తగ్గించుకొని టెండర్ వేయడం దారుణమన్నారు. సింగరేణి టెండర్ షెడ్యూల్‌లో రూ.190 ఇచ్చేందుకు సిద్ధంగా ఉండగా కేవలం తన లాభాపేక్ష కోసం టెండర్ వేసినట్లు ఆరోపించారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా పదివేల కుటుంబాలకు అన్యాయం జరుగుతుందన్నారు. గ్లోబల్ టెండర్ల పేరుతో కార్పొరేట్ కాంట్రాక్టర్లు తమ ఇష్టానుసారం వ్యవహరిస్తే ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మౌలానా, వెంకట్, చిట్టిబాబు, రామారావు, లక్కినేని శ్యామ్, సురేష్, వెంకటేశ్వర్లు, మారుతిరావు, నరేష్, మదార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పనిచేయని సోలార్ పంపు



మరమ్మతులకు గురైన సోలార్ పంపుసెట్



బోరు వద్ద నీళ్ల కోసం నిరీక్షిస్తున్న ప్రజలు

పాల్వంచరూరల్: అసలే వేసవికాలం.. ఈ క్రమంలో సోలార్ పంప్‌సెట్ రెండునెలల క్రితం మరమ్మతులకు గురికావడంతో తాగునీరు లేక ప్రజలు తంటాలు పడుతున్నారు. మండలంలోని ఉల్వనూరు గ్రామపంచాయతీ గంగాదేవిపల్లి గ్రామంలో 30 కుటుంబాల్లో 150 మంది జనాభా నివాసం ఉంటున్నారు. ఒక బోరు, మిషన్ భగీరథ ట్యాంక్, సోలార్ పంపుసెట్ ఉన్నాయి. అయితే మిషన్ భగీరథ నీళ్లు రెండు, మూడు రోజులకోసారి మాత్రమే సరఫరా చేస్తున్నారు. ఉన్న బోరులో సక్రమంగా నీళ్లు రావడం లేదు. దీనికి తోడు సోలార్ పంప్‌సెట్ మోటార్ రెండునెలల క్రితం మరమ్మతులకు గురికావడంతో నిత్యం తాగునీటి కోసం గ్రామప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే దిక్కులేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోలార్ పంప్‌సెట్ మోటార్‌క మరమ్మతులు చేసి తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రత్యేకాధికారి, గ్రామ కార్యదర్శులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సోలార్ పంప్‌సెట్ మోటార్‌కు మరమ్మతులు చేయించి తాగునీటి ఇబ్బందులు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

టెక్నీషియన్లు అందుబాటులో లేరు

గంగాదేవిపల్లిలో సోలార్ పంప్‌సెట్ మోటార్ మరమ్మతుల గురైంది. అయితే మోటార్‌కు మరమ్మతులు చేసే టెక్నీషియన్లు ఆంధ్రాలో మాత్రమే ఉన్నారు. సమస్యను వారికి తెలియజేశాము. వారు వస్తే మరమ్మతులు చేయించి, ప్రజలకు తాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకుంటాం.

– నీలావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

బొగ్గు ఉత్పత్తి, రవాణాలో ముందంజ



ఆర్‌సీహెచ్‌పీలో రైలు మార్గం ద్వారా బొగ్గు రవాణా జరుగుతున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి పరిధిలో కొత్తగూడెం ఏరియా బొగ్గు ఉత్పత్తిలో దూసుకెళ్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24)లో లక్ష్యాన్ని మించి బొగ్గు వెలికితీయగా వచ్చే ఆర్థిక సంవత్సరం లక్ష్యాన్ని మరింత పెంచారు. సింగరేణి వ్యాప్తంగా వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25)లో 72 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఇందులో కొత్తగూడెం ఏరియాకు 148.50 లక్షల టన్నులు కేటాయించారు. ఈ మేరకు జేవీఆర్‌ఓసీ–2కు 111 లక్షల టన్నులు, కిష్టారం ఓసీకి 24 లక్షల టన్నులతో పాటు త్వరలో అనుమతి రానున్న వీకే–7 ఓసీకి 10 లక్షల టన్నులు, పీవీకె–5 ఇంక్‌లైన్ గనికి 3.50 లక్షల టన్నుల లక్ష్యాన్ని కేటాయించింది. 129.5 లక్షల టన్నులకు 138 లక్షల టన్నుల ఉత్పత్తి కొత్తగూడెం ఏరియాకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2023–24)లో 129.50 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నిర్దేశించగా 138 లక్షల టన్నుల ఉత్పత్తితో సంస్థ వ్యాప్తంగా అగ్రస్థానంలో నిలిచింది. ఏరియా ఏర్పాటైన సుమారు 80 ఏళ్ల చరిత్రలో ఇంత మొత్తాన్ని సాధించిన దాఖలాలు ఎన్నడూ లేవు. ఇక 2022–23తో పోలిస్తే మరో రెండు లక్షల టన్నులు అధికంగా ఉత్పత్తి చేయడం విశేషం. ఏరియాలో జీకేఓసీ, వీకే–7ఓసీల్లో ఉత్పత్తి రాకున్నా లక్ష్యాన్ని సాధించింది. అలాగే, ఈ ఆర్థిక సంవత్సరం 3,114 రేక్‌ల బొగ్గును రవాణా చేసి రికార్డ్ సృష్టించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో బొగ్గు రవాణాను పరిశీలిస్తే ఏప్రిల్ 2023లో 289 రేక్‌లు, మే నెలలో 274, జూన్, జూలైలో 256 రేక్‌ల చొప్పున, ఆగస్ట్, సెప్టెంబర్‌లో 257 రేక్‌ల చొప్పున, అక్టోబర్‌లో 233, నవంబర్‌లో 240, డిసెంబర్‌లో 269, 2024 జనవరిలో 268, ఫిబ్రవరిలో 250, మార్చిలో 256 రేక్‌ల బొగ్గును రవాణా చేయడం విశేషం.

మాస్‌లైన్ నాయకుడు మృతి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మాధవరావు, కోటేశ్వరరావు

ఇల్లెందు: మాస్‌లైన్ జిల్లా నాయకుడు గండి యాదగిరి (75) ఆదివారం మృతి చెందారు. కొంతకాలంగా తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి, మమత ఆస్పత్రిలో వైద్యం పొందారు. శనివారం తెల్లారుజామున తుదిశ్వాస విడిచారు. యాదగిరికి భార్య, ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇల్లెందు మండలం మాణిక్యారం గ్రామానికి చెందిన యాదగిరి ప్రజాప్రతిఘటన, మావోయిస్టులతో పని చేసిన నాటి ఉమ్మడి ప్రజాపంథా, న్యూడెమోక్రసీకి ప్రచ్ఛన్న యుద్ధం జరిగిన నాటి నుంచి కారేపల్లికి, ఆ తర్వాత ఇల్లెందుకు మకాం మార్చారు. ఈ క్రమంలో ప్రజాపంథా ఎన్డీగా మారి అందులో చీలికలు పేలికలు జరగడంతో తీవ్ర ఒడిదొడుకులకు గురయ్యారు. అంతిమంగా నేటి మాస్‌లైన్‌లో తుదిశ్వాస విడిచిన ఆయన జిల్లాలోని ఇల్లెందు, బయ్యారం, గార్ల, కారేపల్లి, కామేపల్లి, టేకులపల్లి, గుండాల, ఆళ్లపల్లి మండలాల ప్రజలకు సుపరిచితుడు. యాదన్న మృతికి ఎమ్మెల్యే కోరం కనకయ్య, దొడ్డాడానియేల్, పరుచూరి వెంకటేశ్వరరావు, ఎస్ఏ నబీ, పులిగళ్ల మాధవరావు, జనగం కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, మాజీ జెడ్పీటీసీ చంద్ర అరుణ, నాయిని రాజు, యాకూబ్‌షావళి, ఆవునూరి మధు, తుపాకుల నాగేశ్వరరావు, సారంగపాణి, జె.సీతారామయ్య, రాంసింగ్ నివాళులర్పించారు. కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపి సానుభూతిని వ్యక్తం చేశారు.

నిరుద్యోగులకు న్యాయం చేయండి..



సింగరేణి ప్రధాన కార్యాలయ ముఖద్వారం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఇటీవల నిరుద్యోగులకు ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ విడుదల చేయటాన్ని నిరుద్యోగులు స్వాగతిస్తున్నారు. అయితే 2010, 2017లో ఇచ్చిన నోటిఫికేషన్‌లో కానీ అంతకంటే ముందు ఇచ్చిన మేనేజ్‌మెంట్ పర్సనల్, గ్రాడ్యుయేట్ మైనింగ్, ఇతర పోస్టుల నోటిఫికేషన్‌లో 55 శాతం మార్కుల నిబంధన పెట్టారు. కానీ తాజాగా విడుదల చేసిన 2024 నోటిఫికేషన్‌లో నిరుద్యోగులు ఈ అవకాశాన్ని వినియోగించుకోలేక పోతున్నామని తెలిపారు. ఈ విషయమై తాము తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రిని కలవటం జరిగిందని, సానుకూలంగా స్పందించారని, సింగరేణి సీఎండీతో సంప్రదించారని, ఈ మార్కుల శాతాన్ని 50కి తగ్గించాలని తెలంగాణ ప్రాంత నిరుద్యోగులు సింగరేణి కార్మికుల పిల్లలు యాజమాన్యాన్ని వేడుకుంటున్నారు.

అంతేకాకుండా కేంద్ర, రాష్ట్ర సర్వీసులకు సంబంధించిన ఐఏఎస్, ఐపీఎస్‌తోపాటు గ్రూప్–1, 2 పరీక్షలకు సాధారణంగా డిగ్రీ క్వాలిఫికేషన్ అడుగుతున్నారే తప్ప... తప్పనిసరి పర్సంటేజీకి పోటీ పరీక్షల నిర్వాహకులు కోరటం లేదని, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి పోటీ పరీక్షలకు లేని నిబంధనలు సెకండరీ స్థాయి పోస్టులకు పెట్టటం వలన చాలామంది నిరుద్యోగులు అర్హతను కోల్పోతున్నందున మార్కుల నిబంధనను 50 శాతం తగ్గించాలని నిరుద్యోగులు కోరుతున్నారు. పరీక్ష అనంతరం పేపర్లను అభ్యర్థులకు ఇవ్వాలని, హాల్ టికెట్ల పంపిణీతోపాటు సిలబస్ సమాచారం ఇస్తే సంబంధిత సబ్జెక్ట్‌ను పూర్తిగా చదువుకోలేక పోతున్నామని, పరీక్ష తేదీతోపాటు సిలబస్‌ను ముందుగా ప్రకటించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వయోపరిమితి పెంచాలి



రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమీషన్ నిబంధనల ప్రకారం వయోపరిమితి 44 ఏళ్లకు పెంచిన నేపథ్యంలో సింగరేణిలో ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌లో 30 సంవత్సరాలకు ఇవ్వటం సరికాదు. 44 ఏళ్లకు పెంచి నిరుద్యోగులకు అవకాశం ఇవ్వాలి.

– దుగ్గిరాల సుధాకర్

మార్కుల శాతం తగ్గించాలి..



కేంద్ర, రాష్ట్ర పబ్లిక్ సర్వీసులలో లేని మార్కుల పర్సెంటేజీలు సింగరేణిలో పెట్టటం వలన ఈ ప్రాంత నిరుద్యోగులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఈ నిబంధనలు పెట్టటం వలన కార్పొరేట్ కళాశాలల్లో చదువుకున్న వారికే న్యాయం జరుగుతుంది. మిగతావారికి అన్యాయం జరుగుతోంది. యాజమాన్యం పునరాలోచించాలి. – బుర్రా వీరభద్రం

బస్తీ దవాఖానాలో పేదలకు అందని వైద్యం

- ఆస్పత్రిలో ఒకే ఒక్క డాక్టర్
- నర్సు బదిలీ
- పట్టించుకోని అధికారులు



ఇల్లెందులోని బస్తీ దవాఖానా

ఇల్లెందు: ఇల్లెందు పట్టణంలోని కొత్త కాలనీలోని బస్తీ దవాఖానాకు సుస్తీ చేసింది. ఇక్కడ ఒకే ఒక డాక్టర్. ఆయన కూడా ప్రతీరోజు ఆస్పత్రికి ఆలస్యంగా వస్తుంటాడు. డాక్టర్ వచ్చే సమయానికే రోగులు రావటం అలవాటు పడ్డారు. ఇదిలా ఉండగా ఇక్కడి నర్సు రెండు నెలల క్రితం బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో మరోకరు నియామకం మరిచారు అధికారులు. దీంతో నర్సు స్థానంలో విధులను అక్కడి డాక్టరే నిర్వహిస్తున్నారు. ఏ కారణం చేతనైనా ఒకరోజు విధులకు గైర్హాజరు అయితే ఆ రోజు వైద్యం అందదు. ప్రభుత్వం బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేసింది కానీ, తగిన సదుపాయాలు కల్పించటం, ఖాళీలు భర్తీ చేయటం మర్చిపోయారు. నెలనెలా వచ్చి మందులు అందజేసి రికార్డులు రాసుకుని రిపోర్టులు అందజేయటం వరకే పరిమితం అయ్యారు. బస్తీ దవాఖానాలు బలోపేతం చేస్తే ఏరియా ఆస్పత్రి మీద ఒత్తిడి తగ్గుతుంది. బస్తీ దవాఖానాలను గత ప్రభుత్వం హయాంలో డాక్టర్లను, నర్సులను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ పద్ధతి ద్వారా భర్తీ చేశారు. ఇక బదిలీపై వెళ్లిన వారి స్థానాలు పూర్తి చేయటం, ఇతర సదుపాయాలు కల్పించలేదు. తమ ప్రాంతంలో ప్రజలకు అందుబాటులో ఉన్న బస్తీ దవాఖానాల పట్ల అధికారుల పర్యవేక్షణ కొరవడింది. నూతన ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు గడిచినా ఈనాటి వరకు ఈ బస్తీ దవాఖానాలను అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు తనిఖీ చేసిన పాపాన పోలేదు. సదుపాయాలు కల్పించేందుకు అవగాహన కోసం పరిశీలన కోసం పర్యటించిన నాథుడే లేడు. ఇలాంటి తరుణంలో బస్తీ దవాఖానాల ద్వారా స్థానికులకు ఎలా వైద్యం అందుతుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దవాఖానాను బలోపేతం చేయాలి



పేదలకు వైద్యం అందించే బస్తీ దవాఖానాలను బలోపేతం చేయాలి. కొత్త కాలనీలో ఉన్న బస్తీ దవాఖానా ద్వారా పేదలకు వైద్యం అందుబాటులో ఉండేలా చూడాలి. ఖాళీలు భర్తీ చేయాలి. డాక్టరు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలి. పేదలు కొత్తకాలనీ నుంచి ఏరియా ఆస్పత్రికి వెళ్లడం కష్టంగా ఉంది. బస్తీ దవాఖానాలో పూర్తిస్థాయి వైద్యం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– కాళంగి హరికృష్ణ, కొత్తకాలనీ, ఇల్లెందు



తలుపులు తెరుచుకోని డాక్టర్ గది



తాళం వేసి ఉన్న నర్సు గది